ఎవరిని గెలిపిస్తారో..?

మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో ఓటేసిన 19 లక్షల మంది

- గెలుపోటములను ప్రభావితం చేయనున్న మైనార్టీల ఓట్లు
- మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలో సర్వత్రా ఇదే చర్చ
- బీజేపీ, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ అంటున్న పలువురు

నిజాంపేట్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజక వర్గంలో పోటీ పడుతున్న ప్రధాన పార్టీల ముగ్గురు అభ్యర్థుల గెలుపోటములను ముస్లిం ఓటర్లు ప్రభావితం చేయనున్నారనే చర్చ జోరుగా జరుగుతోంది. కాంగ్రెస్ నుంచి సునీతామహేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మా రెడ్డిలు ప్రధానంగా పోటీ పడి ప్రచారం నిర్వహించి ప్రజల మద్దతు పొందేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇక్కడ పోటీ ఇద్దరి మధ్యనా లేక ముగ్గురి మధ్యనా అనే దానిపై రాజకీయ విశ్లేషకులు రకరకాల విశ్లేషణలు చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉందని కొందరు లేదు ముగ్గురు మధ్య పోటీ ఉంటుందని ఇంకొందరు అంటున్నారు. ఎక్కడ చూసినా ఇదే చర్చ జరగడం మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో హాట్ టాపిక్‌గా మారింది.

◆ దేశంలోనే అత్యంత ఎక్కువగా ఓటర్లు ఉన్న లోక్‌సభ స్థానం మల్కాజిగిరి కావడంతో ఇక్కడి ఎన్నికపై సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నియోజకవర్గంలో సుమారు 38 లక్షల ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో 50 శాతానికి పైగా సుమారు 19 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరి ఈ పోలైన ఓట్లలో ఎవరు ఎక్కువగా ఓట్లు సాధిస్తారో అనే లెక్కలు మాత్రం అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

బీఆర్ఎస్‌కు నాటి ఆదరణ లభించేనా..?

◆ బీఆర్ఎస్ పార్టీకి అంసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కాంగ్రెస్, బీజేపీలను కాదని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలోని అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలుపొందారు. మరి ప్రస్తుతం మారి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి పట్టం కడతారా? లేదా? అనేది తేలాల్సి ఉంది.

పోల్ మేనేజ్‌మెంట్‌లో పోటీ పడ్డా కాంగ్రెస్, బీజేపీలు..

◆ ఎన్నికల ప్రచారం ఒక ఎత్తు కాగా పోల్ మేనేజ్‌మెంట్ మరో ఎత్తు ఈ ఎత్తులో పై చేయి సాధించేందుకు కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా పోటీపడ్డాయి. లోక్ సభ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోని బస్తీలపై కాంగ్రెస్ పూర్తిస్థాయి దృష్టి సారించి పోల్ మేనేజ్‌మెంట్ చేయడంలో బీజేపీ కంటే ఒక అడుగు ముందు ఉన్నట్లు తెలుస్తోంది. బీజేపీ సైతం కాంగ్రెస్‌తో పోటీపడి తన వంతు ప్రయత్నం తీవ్రంగానే చేసింది. బీఆర్ఎస్ మాత్రం కాంగ్రెస్, బీజేపీల తరువాత నిలిచిందని చెప్పవచ్చు.

బీజేపీ అభ్యర్థి ఈటల వైపు మొగ్గు..!

◆ మల్కాజిగిరి నుంచి బీజేపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్ వైపు ప్రజల మొగ్గు చూపారా అనేది మాత్రం అంతు చిక్కడం లేదు. కొంత సానుకూలత అయితే ప్రజల నుంచి లభించినట్లు కనిపించింది. మరి ఆ సానుకూలత ఓట్ల రూపంలో మళ్లిందా లేదా? అనేది చూడాలి. అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీ, ఉత్తర భారతీయులు, క్లాస్ ఓటర్లపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. అదే విధంగా యువత సైతం బీజేపీకే ఓటు వేశారని అంచనాలో ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

సీమాంధ్రులు ఓటేయకపోవడం ఎవరికి నష్టం.. ఎవరికి లాభం..?

◆ ఈ నెల 13న తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సైతం ఎన్నికలు ఉండటంతో మల్కాజిగిరి లోక్ సభ స్థానంలో నివాసం ఉండే సీమాంధ్ర ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లో ఓటు వేసేందుకు వెళ్లారు. ఇక్కడ ఓటు వేయలేదు. ఇలా ఇక్కడ ఓటు వేయకపోవడం వల్ల ఎవరికి నష్టం.. ఎవరికి లాభం అనే అంశంపై అభ్యర్థులతో పాటు నాయకులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వెళ్లిన వారంతా బీజేపీకి ఓటు వేసే వారని కాంగ్రెస్ వారు భావిస్తున్నారు. బీఆర్ఎస్‌కు వేసేవారని బీజేపీ వారు భావిస్తున్నారు.



మైనార్టీల ఓట్లు ఏ పార్టీకి..?

◆ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కేవలం మైనార్టీల ఓట్లు సుమారు 5 నుంచి 6 లక్షల వరకు ఉంటాయనేది అంచనా. ముస్లిం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల్లో ఏవరి వైపు మొగ్గు చూపరనేది ప్రస్తుతానికి చర్చ జరుగుతుంది. అయితే ఎంఐఎం అధినేత సైతం లోక్‌సభ ఎన్నికల్లో ముస్లింలు అందరు హైదరాబాద్ లోక్‌సభ స్థానం మినహా అంతటా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని చెప్పిన విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది.

◆ మైనార్టీలు వంద శాతం బీజేపీకి వ్యతిరేకంగానే ఓటు వేశారని అందులో మెజార్టీ కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేసి ఉండొచ్చని... ఇక క్రిష్టియన్ ఓటర్లు సైతం బీజేపీకి వ్యతిరేకంగానే ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. క్రిష్టియన్ ఓటర్లు సైతం మల్కాజిగిరి ఎంపీ స్థానం పరిధిలో 3 నుంచి 4 లక్షల మధ్యలో ఉంటారని క్రిష్టియన్ సంఘాలు పేర్కొంటున్నాయి.

◆ మైనారిటీ ఓటర్లలో ఎంత మంది తమ ఓటు హక్కును వినయోగించుకున్నరనేది సైతం ప్రధాన అంశం. అదే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారని. రిజర్వేషన్లు తొలగిస్తారని విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే ఏ వర్గం ఓటర్లు ఏ పార్టీని ఆదరించారనేది ఎన్నికల ఫలితాల రోజు తేలాల్సి ఉంది.



ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ బీజేపీ సీనియర్ నాయకుడు అక్కా సురేష్ అన్నారు. ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వారికి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం కార్డులను అందజేసేందుకు రిజిస్ట్రేషన్ ప్రకియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలో 70 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు రిజిస్ట్రేషన్ చేసి ప్రతాలను అందజేశారు.

వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తూకం మెషీన్ల విరాళం


తూకం మెషీన్లు అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్

సాక్షి ఎఫెక్ట్..

ఘట్‌కేసర్: ''సాక్షి'' పత్రికలో ఆదివారం ప్రచురితమైన ''కుప్పలు తిప్పలు'' అన్న కథనానికి వైఎస్సార్ ట్రస్ట్ సభ్యులు స్పందించారు. ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో సరిపోను తూకం మెషీన్లు లేకపోవడంతో ధాన్యం తూకంలో అలస్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌తో కలిసి ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రెండు తూకం మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎంపీపీకి ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవం


సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కీసర: నాగారం మున్సిపాలిటీ, సత్యనారాయణ కాలనీలోని శ్రీరమా సత్యనారాయణ స్వామి, శ్రీ షిర్డీ సాయిబాబాదేవస్థానంలో వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా ఆదివారం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పల్లకిసేవ , అనంతరం హారతులు, పవలింపుసేవ, తీర్థప్రసాద వితరణ తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అలయ కమిటీ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, కౌన్సిలర్లు, అన్నంరాజు లావణ్య శ్రీనివాస్, సుమిత్ర సురేష్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

మేడ్చల్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల కట్టడికి ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు గోదా అరుణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజులు, డొనేషన్ల పేరుతో కార్పొరేట్ విద్యాసంస్థలు నిరుపేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లాగా కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు వెలుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జీవో అమలు చేయాలని కోరారు.

డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి కృషి


విద్యుత్ తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న దృశ్యం





కీసర: జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డు కారణంగా దమ్మాయి గూడ మున్సిపాలిటీలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం, రాంకీ సంస్థలతో చర్యలు తీసుకుంటామని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. ఆదివారం ఆమె దమ్మాయిగూడ మున్సిపల్ కౌన్సిలర్లు, జేఏసీ సభ్యులతో కలిసి రాంకీసంస్థ ఆధ్వర్యంలో దుండిగల్‌లో కొనసాగుతున్న పవర్‌ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్తనుంచి విద్యుత్ తయారీ విధానాన్ని రాంకీ ప్రతినిధులు మున్సిపల్‌పాలకవర్గ సభ్యులు, జేఏసీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో దుండిగల్‌లో చెత్తనుంచి విద్యుత్‌ను తయారు చేసే ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. అదేవిధంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వద్ద కూడా ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నానునాయక్, సురేఖ భాస్కర్‌గౌడ్, జేఏసీ సభ్యులు శంకర్‌నారాయణన్, స్వామిరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు ఎనలేనివి


మాట్లాడుతున్న రూప్‌సింగ్, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్‌కు రాజ్యాంగాన్ని అందించిన ఘనత అంబేడ్కర్‌కే దక్కిందని ఘనాపూర్ మాజీ సర్పంచ్ రూప్‌సింగ్ అన్నారు. ఆదివారం మీసాల అరుణ్‌కుమార్‌తో కలిసి ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటరానితనం నిర్మూలన కోసం అంబేడ్కర్ అనేక పోరాటాలు చేశారన్నారు. అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించడానికి యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో దాను, రాందాను, నర్సింహ్మా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహ్మాస్వామి కల్యాణ మహోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీలోని లక్ష్మి గార్డెన్‌లో ఆదివారం లక్ష్మి నర్సింహ్మాస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. విష్ణుశౌర్య ఆధ్వర్యంలో జరిగిన కళ్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గురువులతో ఘట్‌కేసర్ జెడ్పీ బాలుర పాఠశాల 2006-07 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కొండాపూర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా, ఉద్యోగాల కారణంగా దూరమైన బాల్యమిత్రులను కలిసి తమ క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన గురువులు జంగయ్య, హన్మంతరెడ్డి, సాయిరెడ్డి, విజయసాయిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, విఠల్‌కుమార్, వెంకటేశ్‌ను పూలమాల, శాలువాతో సత్కరించారు.

ఇక స్థానిక సమరమే..!

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియటంతో..

- స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి
- పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికల నిర్వహణకు చర్యలు.
- కోడ్ ముగియగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం..
- ఆదేశాల కోసం పంచాయతీ శాఖ ఎదురు చూపులు
- 'స్థానిక' ఆశావహుల్లో ఉత్సాహం ...ప్రజల మద్దతు కోసం పాట్లు



సాక్షి,మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించింది. లోక్‌సభ పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో ఇదే తరహాలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఎప్పుడు పచ్చజెండా ఊపినా... సిద్ధంగా ఉండాలని ఆదేశాలు వచ్చాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 61 పంచాయతీలు, 596 వార్డు పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.

పాత రిజర్వేషన్ల ప్రకారమే..!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి ప్రత్యేక చట్టం తీసుకొచ్చి ఎన్నికలు నిర్వహించింది. వారి పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగియడంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన తీసుకొచ్చింది. సర్పంచులు, వార్డు సభ్యులకు 2018లో వర్తించిన రిజర్వేషన్లే ఇప్పుడూ ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కానీ అధికారంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వేషన్లు మార్చాలని భావిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా జీవో జారీ చేయాల్సి ఉంటోంది.

ఆశావహుల్లో ఉత్సాహం..

ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో గ్రామ, మండల స్థాయిలో కష్టపడిన పలు పార్టీల నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా ప్రజల మెప్పు పొందే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారు. సర్పంచి పదవులు ఖాళీగా ఉండగా.. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం జులై మొదటి వారంలో ముగుస్తోంది. ప్రభుత్వం అన్నింటికి ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తుందా... లేక మొదట పంచాయతీ ఎన్నికలు చేపడుతుందా.. అనేది స్పష్టం కావాల్సి ఉంది. కాని ఇప్పటికే గ్రామాల్లోని నాయకులు పోటీ చేయడానికి ఉత్సాహంగా ఉన్నారు. స్థానికంగా ప్రజల మద్దతు కూడగట్టుకునేలా ఎవరికి వారే రాజకీయ సమీకరణలు చేసుకుంటున్నారు. ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలను కలుస్తూ ...అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పని చేశామని.. తమకే పూర్తి మద్దతు ఇవ్వాలని పైరవీలను ప్రారంభించినట్లు తెలుస్తోంది. గ్రామాల్లో ఉండే సామాజిక, యువజన, మహిళా సంఘాల మద్దతు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు.

కోడ్ ముగిసిన తర్వాత నిర్ణయం..

పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు తర్వాత కోడ్ ముగియనుంది. అనంతరం పంచాయతీ ఎన్నికలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తుందనే ప్రచారం కూడా జోరుగా సాగుతోంది. తర్వాత జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ఎన్నికలు నిర్వహించవచ్చునని సమాచారం.

ఆదేశాల కోసం ఎదురుచూపులు..

పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తోంది. ఓటరు జాబితాను గ్రామ పంచాయతీల వారీగా సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు బ్యాలెట్ బాక్సులు తెప్పించే ప్రయత్నంలో ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చినా... సిద్ధంగా ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 61 గ్రామ పంచాయతీలు ఉండగా,ఎన్నికల నిర్వహణకు రెండు వేల మంది సిబ్బంది అవసరమని భావిస్తున్నారు. 61 గ్రామ పంచాయతీల్లో 596 వార్డులు ఉండగా, ఇందు కోసం 800 పోలింగ్ స్టేషన్లు,1000 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 24 గ్రామపంచాయతీలు సమస్యాత్మకమైనవిగా గుర్తించగా, ఇందులో శామీర్‌పేట్ మండలంలో 9 గ్రామ పంచాయతీలు, కీసరలో 5, ఘట్కేసర్‌లో 6,మేడ్చల్ మండలంలో 4 గ్రామ పంచాయతీలు ఉన్నట్లు తెలుస్తోంది.

మ్యాన్‌హోల్స్ వేశారు.... రోడ్డు మరమ్మతులు మరిచారు




గుంతలమయంగా మారిన రోడ్డు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో 3వ వార్డులోని రోడ్డు అధ్వానంగా మారింది. అత్వెల్లి నుంచి శాంతాబయోటిక్ వెళ్లే రోడ్డులో డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు ఇటీవల మ్యాన్‌హోల్స్ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు రోడ్డు తవ్వకాలు జరిపారు. పనులు ముగిసిన తర్వాత గుంతలు పూడ్చకపోవడంతో సమీప కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిళ్లు వాహనదారులు గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు, నాయకులు కోరుతున్నారు.

వైకుంఠధామం పనులు ప్రారంభించండి


ఆందోళన చేస్తున్న సుతారిగూడ గ్రామస్తులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ గ్రామంలో వైకుంఠధామం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతూ ఆదివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. చెరువు పక్కన స్మశాన వాటిక ఉండడంతో వర్షాకాలంలో చెరువు నిండి స్మశాన వాటికలోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా గ్రామంలోని సర్వే నెంబర్ 25లో 24 గుంటల స్థలాన్ని రెవెన్యూ అధికారులు వైకుంఠధామం ఏర్పాటుకు కేటాయించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ రూ.20 లక్షలు నిధులు కేటాయించిన అధికారులు పూజలు చేసి పనులు ప్రారంభించలేదన్నారు. వర్షాకాలం వస్తున్నందున అధికారులు స్పందించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు.

బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా శ్రీనాథ్


నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షునిగా బర్ల శ్రీనాథ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయనకు నియామక పత్రం అందజేశారు.కార్యక్రమంలో కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శేఖర్‌గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ వీరభద్రారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల జాతర

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, కేశ్వాపూర్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. గ్రామంలోని పోచమ్మ, మహంకాళి అమ్మవార్లకు మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామస్తులు, పెద్ద ఎత్తున అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంజలి పెనుకొండ శిష్యబృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. తాండవ నృత్య కారి, మూషిక వాహన, రుక్మిణి ప్రవేశం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387